# తెగులు

పాలపర్తి జ్యోతిష్మతి

పని పూర్తిచేసుకుని బయటికి వచ్చిన సుబ్బలక్ష్మికి ఎదురింటి లలిత రెండేళ్ళ కూతుర్ని ఎత్తుకుని 'అదుగో, అది పిగ్, అది డాగ్' అని చెప్తూ కనిపించింది.

'అదేంటి లలితా! చక్కగా పంది, కుక్క అని చెప్పక పిగ్గు, డాగ్గు ఏమిటి' అంది సుబ్బలక్ష్మి.

'ముందు చదవాల్సిందంతా ఇంగ్లీషు మీడియం చదువులే కదా! ఇప్పట్నించే తయారు చెయ్యకపోతే ఎట్లా?' ఎదురు ప్రశ్నించింది లలిత.

'అదే నేనూ అంటున్నాను. ముందుముందు ఎట్లాగూ ఈ ఇంగ్లీషు బెడద తప్పదు. ఇప్పుడే మనం పిల్లలకి చక్కటి తెలుగు నేర్పించాలి. నువ్విట్లా ప్రతిదీ ఇంగ్లీషులోచెప్తున్నావు కాబట్టే దానికి మాటలు రావడం ఇంత ఆలస్యమవుతోంది. అని లలితకి చెప్పి 'కదే అమ్మలూ?' అంటూ చిన్న పిల్లవైపు చేతులు చాపింది సుబ్బలక్ష్మి.

'అమ్మలూ ఏంటి సుబ్బలక్ష్మీ! దీని ముద్దుపేరు డాలీ అని ఎన్నిసార్లు చెప్పాను నీకు?' పిల్లని సుబ్బలక్ష్మికి అందిస్తూ విసుక్కుంది లలిత.

'ఆడపిల్లల్ని అమ్మలూ, చిన్నారీ, పాపాయ్ అని పిలిస్తే ఉండే ముద్దు ఆ ఇంగ్లీషు పేర్లలో ఉంటుందా.'

'ఏమోలేమ్మా! నా పిల్లలకి నేను స్వీటీ, డాలీ అని ముద్దు పేర్లు పెట్టుకున్నాను. వాళ్లని ఎవరైనా ఆ పేర్లతో పిలిస్తేనే నాకు బాగుంటుంది'. నిష్ఠూరంగా అంది లలిత.

'బుజ్జిబొమ్మాళీ' అంటూ డాలీని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది సుబ్బలక్ష్మి.

'మళ్ళీ అదేం పిలుపు?'

'డాల్ అంటే బొమ్మ కదా! డాలీని బొమ్మీ అంటే బాగుండదు కాబట్టి బొమ్మాళీ అన్నాను.'

అప్పటికాకా సుబ్బలక్ష్మి కొంగు పట్టుకుని గునుస్తున్న చింటూ సుబ్బలక్ష్మి చేతుల్లోంచి డాలీని లాక్కుని గట్టిగా నవ్వుతూ 'వదల బొమ్మాళీ! నిన్నొదల' అంటూ గిరగిరా తిప్పాడు.

డాలీ కిలకిలా నవ్వింది కానీ అక్కడే కూర్చుని లెక్కలు చేసుకుంటున్న స్వీటీ బిక్కమొహం పెట్టి భయం భయంగా చూసింది.

'దాని మొహమేంటి అట్లా అయిపోయింది?' అడిగింది సుబ్బలక్ష్మి.

బొమ్మాళీ అనేటప్పటికి అరుంధతి సినిమా గుర్తొచ్చినట్టుంది. ఆ సినిమా చూసి ఎంత భయపడిపోయిందో!' చెప్పింది లలిత.

'అమ్మా! ఈ లెక్క చెప్పవా?' పిలిచింది స్వీటీ.

లలిత ఒక్క పరుగున స్వీటీ దగ్గరకెళ్లి చెంప పగలగొట్టింది.

'అదేంటి లలితా, అంత దెబ్బ కొట్టావు? అదేం చేసిందిప్పుడు?' కంగారుగా అడిగింది సుబ్బలక్ష్మి.

'అమ్మా అన్నప్పుడల్లా 'అమ్మ కాదు మమ్మీ అనాలి' అని దీనికి చెప్తూనే ఉన్నాను. అయినా మాట వినదు. ఎంత మొండితనమో చూడు' కోపంగా అంది లలిత.

దానికి ఎట్లా పిలవడం ఇష్టంగా ఉంటే, ఎట్లా పిలవడం వీలుగా ఉంటే అట్లా పిలుస్తుంది. అయినా అమ్మని అమ్మ అంటే తప్పేంటి?'

'పల్లెటూరి గబ్బిలాయిలా అమ్మ ఏంటి? ఎక్కడికైనా ఫంక్షన్స్‌కి వెళ్ళినప్పుడు అందరు పిల్లలూ చక్కగా మమ్మీ, డాడీ అని పిలుస్తుంటే ఇది అమ్మా, నాన్నా అంటుంటే నాకు తల కొట్టేసినట్టు ఉంటుంది. 'ఈవిడకి ఇంగ్లీషు రాదు కాబోలు, అందుకే కూతురికి మమ్మీ, డాడీ అనడం నేర్పలేదు' అనుకోరూ విన్నవాళ్ళు?'

'ఇట్రామ్మా తీపీ!' ముద్దుగా పిలిచింది సుబ్బలక్ష్మి. లలిత మొహంలోని ప్రశ్నార్థకం చూసి 'దీనిపేరు స్వీటీ కదా? స్వీట్ అంటే తెలుగులో తీపి. కాబట్టి స్వీటీని తీపీ అని పిలిచాను' అంటూ వివరించింది.

'నీకు తెలుగు పిచ్చి బాగా ఎక్కువైపోయింది సుబ్బలక్ష్మీ!'

'నాకు తెలుగు పిచ్చికాదు, నీకు ఇంగ్లీషు పిచ్చి ముదిరిపోయింది.'

డాలీని కిందకి దింపి సుబ్బలక్ష్మి వెనక చేరి మళ్ళీ నస మొదలు పెట్టిన చింటూని చూస్తూ 'వాడి గొడవేంటి?' సంభాషణ మారుస్తూ అడిగింది లలిత.

టీవిలో సినిమా చూస్తానంటున్నాడు.'

'చూడనివ్వచ్చు కదా? ఆదివారం కాసేపు టీవి చూస్తే ఏమవుతుంది?'

'ఆ సినిమా వాడు చూడ్డం వాళ్ళ నాన్నకి ఇష్టం లేదు. కోప్పడి టీవీ కట్టేసి బయటికెళ్ళారు. 'నాన్న ఇంట్లో లేరు కదా! వచ్చేలోపల కాసేపు సినిమా చూస్తాను' అని పేచీ పెడుతున్నాడు.'

'పోనీ కాసేపు చూడనివ్వరాదూ? మా టీవీ రెండు రోజుల్నించీ పని చెయ్యట్లేదు. లేకపోతే మా ఇంట్లో చూసేవాడు.'

'అ... మమ్మీ చింటూతో పాటు నేను కూడా కాసేపు సినిమా చూడనా?' పుస్తకాలు కింద పెట్టి లేచి వచ్చి లలితని అడిగింది స్వీటీ.

'రా! రా! చూద్దాం రా!' ఉత్సాహంగా పిలిచాడు చింటూ.

కళ్ళతోనే వెళ్ళమని అనుమతి ఇచ్చింది లలిత.

'పది నిమిషాలు చూసి ఆపెయ్యండి. ఎక్కువసేపు చూడొద్దు. నాన్నొచ్చేదాకా చూస్తూ కూర్చున్నారంటే ఎందుకు చూడనిచ్చావని నన్ను కోప్పడతారు' లోపలికెళ్తున్న పిల్లల్ని హెచ్చరించింది

సుబ్బలక్ష్మి.

ఏం సినిమా ఏంటి?'

సమాధానం చెప్పడానికి తటపటాయిస్తున్న సుబ్బలక్ష్మిని చూసి మళ్ళీ రెట్టించింది లలిత 'వాడు ఆ సినిమా చూడ్డం మీ ఆయనకి ఇష్టం లేదంటున్నావు, నువ్వు కూడా ఎక్కువసేపు చూడొద్దంటున్నావు. ఇంతకీ ఏం సినిమా ఏంటి అది?'

'చదువు పాడవుతుందని ఆయన వద్దన్నారు. ఆయన కోప్పడతారని నేను వద్దంటున్నాను. సినిమా పేరు... అమ్మ.... అని ఏదో ఉంది.'

'అమ్మా అని పిలవద్దన్నానని అమ్మ అని పేరు వచ్చే సినిమా చూడడానికి ఒప్పుకోనేమో అనుకుంటున్నావా? నా పిల్లలు ఇంగ్లీషు బాగా నేర్చుకోవాలి. మమ్మల్ని మమ్మీ, డాడీ అని పిలవాలని నా కోరిక. అంతేకానీ సినిమాల పేర్లని నేను నిర్ణయించగలనా? తెలుగు సినిమాలుకాకుండా ఇంగ్లీషు సినిమాలు మనం చూస్తామా? చూసినా అర్థం అవుతాయా?

'ఏమోలే! నువ్వేమంటావో అనుకున్నాను. మళ్ళీ దాని వీపు వాయగొడ్తావేమోనని భయపడ్డాను.'

గర్వంతో కూడిన దరహాసం కదలాడింది లలిత పెదవుల మీద. 'చూడనీ. సినిమా చూసైనా అమ్మ మాట వినడం నేర్చుకుంటుంది.'

'చిన్నగా నవ్వింది సుబ్బలక్ష్మి.

ఐదు నిముషాల్లో బిక్కమొహాల్తో బయటికొచ్చారు చింటూ, స్వీటీ.

'పది నిమిషాలు చూడమంటే ఐదు నిముషాలకే వచ్చేశారేం?' అడిగింది లలిత.

'సినిమా చూసి భయపడింది. 'స్వీటీని చూపిస్తూ చెప్పాడు చింటూ. 'నాక్కూడా భయమేసింది. అందుకే టీవీ ఆపేసి బయటికి వచ్చేశాం.' ఆయాస పడుతూ చెప్పి 'నేను ఆడుకోడానికి వెళ్తున్నా' అంటూ వీధిలోకి పరుగెత్తాడు.

'సినిమాయే కదమ్మా! అదంతా నిజం కాదు. భయం లేదు.' అంటూ స్వీటీని దగ్గరికి తీసుకుంది సుబ్బలక్ష్మి. స్వీటీ బిత్తరచూపులు చూస్తూ సుబ్బలక్ష్మిని అతుక్కుపోయింది.

అంత భయపడ్డానికి ఏం సినిమా అది? రా! ఇట్రా! అంటూ స్వీటీ వైపు చెయ్యి చాపింది లలిత.

లలిత చేతికి అందకుండా సుబ్బలక్ష్మి వెనక దాక్కుంది స్వీటీ.

'ఇదేమిటి ఈ పిల్ల ఇట్లా అయిపోయింది? అసలేం సినిమా అది?' గట్టిగా సుబ్బలక్ష్మిని నిలదీసింది లలిత.

'ద మమ్మీ' తాపీగా సమాధానం చెప్పింది సుబ్బలక్ష్మి.

'అయ్యో! ఆ సినిమా పిల్లల్ని చూడనిస్తారా ఎవరైనా?'

'నేను వద్దంటుంటే నువ్వేగా చూడమన్నది.'

'ఏదో తెలుగు సినిమా అనుకున్నా. నువ్వైనా సినిమా పేరేంటంటే అమ్మ అంటూ ఏదో చెప్పావు కానీ అసలు సినిమా పేరు చెప్పావా.?'

'మమ్మీ అన్నా అమ్మ అన్నా ఒకటే కదా? నువ్వు అమ్మని మమ్మీ అనమంటున్నావు. నాకు తెలుగు ఇష్టం. అందుకే నేను మమ్మీని అమ్మ అని చెప్పాను.'

ఏం మాట్లాడాలో తెలీక వెర్రి చూపులు చూస్తున్న లలితతో మళ్ళీ అంది సుబ్బలక్ష్మి 'ఆ సినిమాలో మమ్మీతో నిన్ను సరిపోల్చుకున్నట్లుంది, నిన్ను చూసి కూడా భయపడుతోంది.'

లలిత కళ్ళలో గిర్రున నీళ్లు తిరిగాయి. 'మమ్మీని కాదమ్మా నేను. అమ్మని. ఇంకెప్పుడూ మమ్మీ అని పిలవమని అనను.. నిన్ను కొట్టను. నా దగ్గరికి రామ్మా!' అంటూ స్వీటీ వైపు చేతులు చాపింది.

'భయం లేదు' అన్నట్టు వీపు నిమిరి స్వీటీ చేతిని లలిత చేతికి అందించింది సుబ్బలక్ష్మి.

# అమాయకుడు

**–డా॥ఎన్. గోపి**

అతడు తెలివైనవాడు కాదు
అయితే కవిత్వమెందుకు రాస్తాడు?
లోకం ప్రజల ప్రమేయంతో
నడుస్తుందనుకుంటాడు
తన పిడికిళ్ళ నిండా
రక్తఝంఝులు హోరెత్తుతున్నాయని
అతని భావన!
దేశమంటేగుత్తేదార్లనీ
సిండికేట్లనీ
కన్సార్టియంలనీ
రోడ్లన్నీ
మనుషుల్ని కలిపే దారాలు కాదనీ
సరుకుల్ని చేరవేసే జారుడు బండలనీ
ఇవన్నీ తెలిస్తే
కలం పట్టేవాడుకాదు.
హలమూ పట్టేవాడు కాదు.
మార్కెట్‌కు అనుకూలంగా
ఆలోచించటమే ఆధునికత
యాడ్స్‌కు పదును పెట్టడమే
భాషకు కవితార్థయుక్తి.
పొద్దున వేపపుల్లతో
పళ్ళు తోముకుంటున్నాడతడు
సూర్యకిరణాలతో
ఒళ్ళు రుద్దుకుంటున్నాడు
అతని కూని రాగాన్ని
దోచుకోవటమే
ఇవాళటి విషాదం
అతని వాకిలీ, వీధులూ
మలుపులూ దోచుకొని
అతని ముఖాన
ఓ అగ్గిపెట్టె పారెయ్యటమే
నేటి విద్ధూరం.
మానవయాతనను ఫ్రేముల్లోబంధించి
నువ్వుకోరుకునే దృష్యాన్ని
మళ్ళీ మళ్ళీ చూపించడమే
వర్తమాన విస్మయం
రండి! రక్తం, కన్నీళ్లు కురుస్తున్నాయి
టీవిలకు బూస్టర్లు పెట్టండి
అప్పటికిగాని విధ్వంసం పూర్తికాదు
ఇంక ఇప్పుడు కవిత్వం అవసరంలేదు.